సాక్షి
ప్రకాశం

బుధవారం । 22 । జనవరి । 2025



కబ్జా కోరల్లో 150 ఎకరాలు

ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు టీడీపీ నేతలు పాగా వేస్తున్నారు. తర్లుపాడు మండలం బుడ్డపల్లి గ్రామంలో టీడీపీ నేత అక్రమాలపై సీఎంకు ఫిర్యాదులు వెళ్లాయి. - 8లో..



దైవదర్శనానికి వెళ్లొస్తూ.. అనంత లోకాలకు


కొండపి సమీపంలో కర్రల లోడు ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు మృతిచెందారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

వేలానికి అధ్యక్షా!



అధికారంలోకి వచ్చిందే తడవుగా అధికార కూటమి నేతలు ఇసుక, మట్టి, రేషన్ బియ్యం..ఇలా అన్నింటిలోనూ అక్రమాలకు తెరతీశారు. ఇష్టారాజ్యంగా దోపిడీ చేసి జేబులు నింపుకొన్నారు. తాజాగా అన్నదాతకు చేదోడుగా ఉండే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలపై నేతలు కన్నేశారు. ఈ సంఘాలను అడ్డంపెట్టుకుని దండుకునేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ పదవులను అమ్మకానికి పెట్టారు. ప్రధానంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో ప్రాంతాన్ని బట్టి ధర నిర్ణయించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సొసైటీలపై పచ్చ గద్దలు

- ప్రాథమిక పరపతి సంఘాల పదవులు వేలం..
- ప్రాంతాన్ని బట్టి రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు పలకనున్న పాట
- పరపతి అధ్యక్ష పదవులపై కన్నేసిన టీడీపీ నేతలు
- యర్రగొండపాలెం నియోజకవర్గంలో తెరవెనుక భాగోతం

యర్రగొండపాలెం:

జిల్లా వ్యాప్తంగా 90 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. అందులో సుమారు 24 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2019 వరకూ అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు సొసైటీలను లూటీ చేశారు. వాటిని గాడిలో పెట్టేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నుంచి వీటికి నిధులు కేటాయించి ముందుకు నడిపించారు. వీటిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు, జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేయించారు. వైఎస్సార్‌సీపీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరోనా మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఆ సమయంలో ముందుగా అధ్యక్షుడితోపాటు ఇద్దరు సభ్యులు ఉండేలా సొసైటీల బాధ్యత అప్పచెప్పారు. నష్టాల్లో ఉన్న వాటిని గట్టెక్కించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సొసైటీ పాలక వర్గం సభ్యులతో రాజీనామాలు చేయించింది. అధికారులను ఇన్‌చార్జులుగా నియమించింది. తాజాగా త్రిసభ్య కమిటీ వేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ప్రచారం. అందులో భాగంగానే అధికార కూటమి నేతలు వీటిపై కన్నేశారు. ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని తెర వెనుక మంత్రాంగం నడుపుతున్నారు.

యర్రగొండపాలెంలో వేలం పాటలు?

యర్రగొండపాలెం నియోజకవర్గంలో వ్యవసాయ పరపతి సంఘాల్లో అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు అధికార టీడీపీ నేతలు యత్నాలు మొదలు పెట్టారు. నియోజకవర్గంలో మొత్తం 11 పరపతి సంఘాలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘానికి సుమారు 3 వేల మంది సభ్యులు ఉంటారు. మొత్తంగా 33 వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాలకు అధ్యక్ష పదవే కీలకం. సొసైటీలపై పెత్తనం చెలాయించి రైతులకు రుణాలిప్పించే ప్రక్రియలో కమీషన్ల పేరుతో దండుకోవచ్చని, సొసైటీ పరిస్థితి ఆధారంగా పదవులు బేరానికి పెట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొసైటీల్లో ఎలాగైనా తమ పరపతి పెంచుకునేందుకు టీడీపీ నాయకులు కొందరు ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకాడడంలేదని తెలుస్తోంది. అధిక పోటీ ఉన్న చోట వేలంపాటలు సైతం నిర్వహించేందుకు నేతలు రంగం సిద్ధం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రంలోని పీఏసీఎస్‌పై కన్నేసిన అటూ.. ఇటూ పార్టీ ఫిరాయించే ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఒక నాయకుడు తమ సామాజిక వర్గానికి ఆ పదవీ కేటాయించి తనకు అధ్యక్షుడిగా ప్రతిపాదించినట్లయితే రూ.35 లక్షలు ఇచ్చేలా నియోజకవర్గ స్థాయి కూటమి నాయకుడి వద్ద ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. బీసీ సామాజికవర్గానికి కేటాయించి తనను అధ్యక్షుడిగా చేసినట్లయితే రూ.25 లక్షలు ముట్టచెప్తానని మరొకరు బేరాలు సాగుతున్నట్టు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. యర్రగొండపాలెంలోని సొసైటీ అధ్యక్ష పదవి ఎస్టీ, బీసీలకు కేటాయించినట్లయితే తమ అందరికీ ఆనందమేనని, కానీ పదవిని డబ్బులతో కొనే వారికి అందలం ఎక్కిస్తే తమ పరిస్థితి ఏమిటని కూటమి వర్గానికి చెందిన రైతులు గుసగుసలాడుకుంటున్నారు. రైతుల పక్షాన పోరాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు సహకార పరపతి సంఘాల్లో అక్రమార్కులకు చోటు దక్కనివ్వకుండా చూడటానికి సిద్ధం అవుతున్నారు.



యర్రగొండపాలెంలోని కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం

నేడు గిడుగు రామ్మూర్తి పంతులు వర్ధంతి సభ

ఒంగోలు మెట్రో: జిల్లా గ్రంథాలయంలో బుధవారం ఉదయం పది గంటలకు ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో సాహిత్య వ్యాసాంగంలో, నూతన విద్యా రంగంలో, గ్రాంధిక భాష కాకుండా వ్యవహారిక భాషను వాడాలన్న మహోద్యమానికి ప్రాణం పోసిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు 85వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అతిథులుగా, వక్తలుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి తదితరులు పాల్గొంటారన్నారు.

23న స్త్రీ, పురుషుల కబడ్డీ జట్ల ఎంపిక

చినగంజాం: 71 వ అంతర జిల్లాల స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టును ఈ నెల 23 వ తేదీ ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మన్నెం శ్రీకాంత్, కార్యదర్శి చెరుకూరి పుల్లయ్య తెలిపారు. 23 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చినగంజాం మండల కార్యాలయం సమీపంలోని సోపిరాల లలితా పరమేశ్వరి రామకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా సీనియర్ పురుషులు, మహిళల జట్లు ఎంపిక జరుగుతుందని తెలిపారు. పురుషుల బరువు 85 కిలోలు లోపు, మహిళల బరువు 75 కిలోల లోపు ఉండాలన్నారు. ఈ ఎంపికలకు వచ్చే క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డులు తీసుకొని రావాలన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఉమ్మడి విశాఖపట్టణం జిల్లా అంకుపాలెం జరిగే అంతర జిల్లాల స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 6301015775, 9966986373 నంబర్లను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు ఒంగోలులో అక్కినేని వర్ధంతి

- సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్‌కు అక్కినేని అవార్డు ప్రదానం

ఒంగోలు మెట్రో: పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 11వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కళ్ళగుంట కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ కు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అవార్డు 2025ను ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. గతంలో ఈ అవార్డును కళా తపస్వి కె.విశ్వనాథ్, సినీ హీరోలు సుమన్, చంద్రమోహన్ తో పాటు పలువురు సినీ రంగ ప్రముఖులకు అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వందేమాతరం శ్రీనివాస్, ప్రముఖ గాయనీ గాయకులు పాల్గొనే సంగీత విభావరికి వ్యాఖ్యాతగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ వ్యాఖ్యాతగా ఉగాది పురస్కారం అందుకున్న పొన్నూరు వేంకట శ్రీనివాసులు వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్‌రావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అన్నల్లూరి వెంకటేశ్వర్లు, మండవ మురళీకృష్ణ, నగరంలోని పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. నగరంలోని కవులు, కళాకారులు, సాహిత్య, సంగీత కళాసంస్థల ప్రతినిధులు, అక్కినేని అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

అర్జీల పరిష్కారం, రీ సర్వే పై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టరు తమీమ్ అన్సారియా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారం, రీ సర్వేపై క్షేత్ర స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం భవనం నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో మంగళవారం వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ మ్యుటేషన్ల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం రీసర్వే ప్రక్రియను కూడా మండలంలోని ఒక్క గ్రామానికే చేస్తున్నందున లోప రహితంగా నిర్వహించాలన్నారు. సర్వే అంశాలపై రెవెన్యూ సిబ్బందికి స్పష్టమైన అవగాహన కోసమే జిల్లా స్థాయిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మీ కోసం అర్జీల పరిష్కారంలోనూ నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు స్థల పరిశీలన



ఎయిర్‌పోర్ట్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ మధుసూదన్‌రావు

కొత్తపట్నం: జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన కోసం బుధవారం ఎయిర్ అథార్టీ ఇండియా కేంద్ర బృందం రానుంది. ఈ నేపథ్యంలో కొత్తపట్నం మండలంలో ఎయిర్‌పోర్ట్‌కు ప్రతిపాదించిన భూములను మంగళవారం ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, డీఐఓఎస్ శ్రీనివాసరావు, తహసీల్దార్ మధుసూదన్‌రావు, మండల సర్వేయర్ సుధీర్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆలూరు, అల్లూరు గ్రామాలకు చెందిన భూములు ఎయిర్‌పోర్ట్‌కు అనుకూలంగా ఉంటాయని గుర్తించారు. ఆయా గ్రామాల్లో 657 ఎకరాలు కావాల్సి వస్తుందన్నారు. ఆలూరులో సర్వే నంబర్లు 590 నుంచి 600, అల్లూరులో సర్వే నంబర్లు 1700 నుంచి 1800 వరకు భూములు ఉంటాయన్నారు. కేంద్ర బృందం వచ్చిన తరువాత సర్వే నెంబర్లలో కొంత మార్పులు కూడా జరగవచ్చని చెప్పారు.

స్థల వివాదంలో ఉద్రిక్తత

- రెండు వర్గాల మధ్య ఘర్షణ
- భారీగా గుమికూడిన జనం
- జనాన్ని చెదరగొట్టేందుకు ప్రయత్నించిన పోలీసులు
- ఎస్సైపై అవినీతి ఆరోపణలు చేసిన స్థానికులు
- ఆరోపణలు చేసిన వ్యక్తిని స్టేషన్‌కు లాక్కెళ్లిన ఎస్సై
- వివాదానికి ఆజ్యం పోసిన దేవదాయశాఖ అధికారులు



వివాదాస్పద దేవదాయ భూమిలో గోడ నిర్మిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: వివాదాస్పద దేవదాయ శాఖ స్థలంలో అక్రమ కట్టడాల నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకోవడం ఘర్షణకు దారితీసింది. పోలీసుల రాకతో అది మరింత ఉద్రిక్తంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. సింగరాయకొండలోని కూరగాయల మార్కెట్ సెంటర్‌లో సర్వేనంబర్ 605 ఏ2లో సుమారు 16 సెంట్ల భూమిని రంగని పద్మావతితో పాటు మరికొందరు కొనుగోలు చేశారు. ఇందులో తాను కొనుగోలు చేసిన మూడు సెంట్ల స్థలంలో పద్మావతి సిమెంటు రాళ్లతో గోడ కట్టేందుకు ప్రయత్నించారు. దీంతో స్థానికులు ఆ స్థలంలో గోడ కడితే రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, కొంత స్థలం వదిలి కట్టుకోవాలని ఆమెతో వాదులాటకు దిగారు. అయితే పద్మావతి మాత్రం తాను కొనుగోలు చేసిన హక్కుగల స్థలంలోనే గోడ నిర్మిస్తున్నానని, ఒక్క సెంటు కూడా ఆక్రమించుకోలేదని వారికి తేల్చి చెప్పింది. దీంతో ఇరువురి మధ్య వాదులాట జరగటంతో పాటు స్థానికులు ఆ స్థలంలో ఉన్న రేకులను లాగి పడేశారు. దీంతో కొంతసేపు ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై బీ మహేంద్ర వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఇక్కడ గోడ కడితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, అంతేకాక మా వాళ్ల మృతదేహాలు తీసుకుని పోవాలంటే ఇబ్బందిగా ఉంటుందని, గోడ నిర్మాణాన్ని ఆపాలని కొందరు ముస్లింలతో పాటు ఇతర సామాజిక వర్గాల వారు ఎస్సైకు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో షేక్ వాజిత్ ఆలీ అనే వ్యక్తి ఆమె వద్ద డబ్బులు తీసుకుని సహకరిస్తున్నారని ఎస్సై మహేంద్రపై ఆరోపణ చేయటంతో ఆగ్రహించిన ఎస్సై.. అతని చొక్కా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. అక్కడ ఉన్న ముస్లింలు వాజిత్ ఆలీని తీసుకుని వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ముస్లింలకు మధ్య కొంతసేపు తోపులాట జరిగింది. తాను సామరస్యంగా సమస్య పరిష్కరిద్దామని ప్రయత్నిస్తుంటే ఏ తప్పు చేయకుండా అవినీతి ఆరోపణలు చేస్తావా అని ఆగ్రహం వ్యక్తం చేసి వాజిత్‌ఆలీని రోడ్డు పై లాక్కుని వెళ్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తరువాత స్థానికులు బతిమిలాడటంతో అతనిని వదిలేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారిని సీఐ సీహెచ్ హజరత్తయ్య పిలిపించి మాట్లాడారు. ఆ సమయంలో తహశీల్దార్ టీ రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి జగదీష్‌లు కూడా అక్కడే ఉన్నారు. ఆ స్థలంలో కట్టడాలు ఆపాలని తహశీల్దార్ టీ రవి సూచించినప్పటికీ పద్మావతి ససేమిరా అంది. తాను డబ్బులు పెట్టి కొనుక్కున్నానని, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తానని తెగేసి చెప్పింది. కొంతమంది కావాలని వివాదం సృష్టిస్తున్నారని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపణ చేసింది. దీనిపై సీఐ హజరత్తయ్య డబ్బులు డిమాండ్ చేసిన వారి వివరాలు చెబితే వారిపై కేసులు నమోదు చేస్తానని హామీ ఇచ్చారు. ఈఓ జగదీష్ అక్కడ కట్టడాలు ఆపాలని ఉడా నిబంధనలు ప్రకారం రోడ్డుకు కొంత స్థలం వదలాలని.. త్వరలో పంచాయతీ సమావేశం ఏర్పాటు చేసుకుని ఈ రోడ్డు ఎంత వెడల్పు ఉండాలో తీర్మానం చేస్తామని చెప్పారు. అప్పటి వరకు ఆపాలని పద్మావతికి సూచించారు. అయితే పద్మావతి మాత్రం దాదాపు నెల నుంచి మీ చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదని, గోడ కడతానని.. మీ తీర్మానం ప్రకారం రోడ్డు వెడల్పు ఎంత ఉండాలో నిర్ణయిస్తే అప్పుడు గోడ తొలగిస్తానని చెప్పింది. అంతేకాక ఆ రోడ్డులో ఉన్న ఆక్రమణలు కూడా తొలగించాలని డిమాండ్ చేసింది.

ఆలస్యంగా వచ్చిన దేవదాయ శాఖ అధికారి

ఈ వ్యవహారంలో ప్రధానపాత్ర పోషించాల్సిన పాతసింగరాయకొండ వరాహలక్ష్మీ నరశింహ స్వామి దేవాలయ కార్యనిర్వహణాధికారి పీ కృష్ణవేణి సీఐ కార్యాలయానికి ఆలస్యంగా వచ్చారు. వాస్తవానికి ఆ స్థలానికి సంబంధించి పూర్తి నిర్ణయాధికారం ఆమెదే. ఆమె తాపీగా వచ్చి సీఐ, ఎస్సైకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈనెల 9వ తేదీ ఒంగోలు దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, కందుకూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ, ఈఓ కృష్ణవేణి వచ్చి మరీ పద్మావతి స్థలంతో పాటు పక్కనున్న 13 సెంట్ల స్థలానికి బోర్డు ఏర్పాటు చేశారు. ఇది దేవదాయ స్థలం... ఇందులో ఎవరు ప్రవేశించినా వారిపై క్రిమినల్ కేసులు బనాయిస్తామని బోర్డు లో పేర్కొన్నారు. కానీ తాజాగా కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం బెయిలబుల్ సెక్షన్లు మాత్రమే వర్తిస్తాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారంలో దేవదాయ శాఖ అధికారులకు భారీగానే ముట్టాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరికి పద్మావతి ఆ స్థలంలో తను అనుకున్న విధంగా కూలీలతో గోడ నిర్మాణం చేపట్టింది. సాయంత్రానికి ఆ స్థలంలోకి 145 యాక్టు ప్రకారం ఎవరూ ప్రవేశించరాదని తహశీల్దార్ టీ రవి ఆదేశాలు జారీ చేశారని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఆదేశాలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేంద్ర హెచ్చరించారు. ఈ ఘటనపై తహశీల్దార్, పంచాయతీ కార్యదర్శి, దేవదాయ ఈఓ ల నుంచి రాతపూర్వక ఫిర్యాదులు అందాయని పోలీసులు తెలిపారు. స్థానిక ప్రజలు మాత్రం ఈ స్థలంతో పాటు పక్కనే ఉన్న దేవదాయ స్థలం పై కూడా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. అయితే కొనుగోలుదారులు మాత్రం తాము లక్షలు పెట్టి స్థలాలు కొనుగోలు చేస్తే అనవసరంగా వివాదాలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పోలీసులకు, స్థానికులకు మధ్య తోపులాట జరుగుతున్న దృశ్యం



ఇరువర్గాలు, అధికారులతో కలిపి మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య

ఎయిడెడ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ వినతి

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ కమిషనర్ పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, ప్రభాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి జిల్లాలో 138 ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రస్తుతం 615 మంది ఉపాధ్యాయ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా రకరకాల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు మండలం, చెరుకూరు గ్రామంలోని ఆంధ్రకేసరి మెమోరియల్ రెసిడెన్షియల్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా వారు వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వలేదని, గత 12 నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొమరోలు మండలం గోపానపల్లి ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఆంజనేయులు జీతాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యాజమాన్యాల్లోని ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వార్షిక ఇంక్రిమెంట్ల సమస్య, జీరో ఎన్‌రోల్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను శాశ్వతంగా ప్రభుత్వ పాఠశాల్లోకి సర్దుబాటు చేయాలని విద్యాశాఖ డైరెక్టరు వి.విజయరామరాజును కోరారు.

కార్మిక ప్రజాస్వామ్యం అవసరం



సెమినార్‌లో మాట్లాడుతున్న మార్క్సిస్టు పత్రిక సంపాదకుడు వెంకటరావు

ఒంగోలు టౌన్: విస్తారమైన ప్రజల హక్కులను కాపాడుకునేందుకు కార్మిక ప్రజాస్వామ్యం రూపొందించుకోవాలని మార్కిస్ట్ పత్రిక సంపాదకుడు ఎస్ వెంకటరావు పిలుపునిచ్చారు. లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా మంగళవారం సుందరయ్య భవనంలో పెట్టుబడి-ప్రజాస్వామ్యం అనే అంశం మీద సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూర్జువా పెట్టుబడిదారులను కాపాడేందుకు ఈ ప్రజాస్వామ్యం ఉందని చెప్పారు. కమ్యూనిస్టులు కార్మికవర్గ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రూపొందించుకోవాలన్నారు. ప్రతి కార్మికుడికి, శ్రామికుడికి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కాలని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ మార్క్సిజాన్ని ప్రపంచ వ్యాప్తం చేయడంలో లెనిన్ కీలకపాత్ర పోషించారని చెప్పారు. సామ్రాజ్యవాదం నిరంతరం యుద్ధాలను కోరుతుందని, ప్రజా స్వామ్యాన్ని నాశనం చేసేది కూడా వాళ్లేనని చెప్పారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు వైజ సిద్దయ్య, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలాజీకి తెలుగు కీర్తి జాతీయ పురస్కారం

టంగుటూరు: అంతర్జాతీయ ప్రామాణిక సంస్థగా గుర్తింపు పొందిన శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో తన్నీరు బాలాజీ కి తెలుగు కీర్తి జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. బాలాజీ కందుకూరులో మహతి సాహితీ సాంస్కృతిక సంస్థను స్థాపించి పద్య కవిగా, సాహితీ వేత్తగా, గాయకునిగా కార్యక్రమాలు నిర్వహించారు. టంగుటూరు మండల విద్యాధికారిగా, భారత స్కౌట్స్ అండ్ గైడ్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మహతి సంస్థ ద్వారా అనేక అష్టావధానాలు, కవి సమ్మేళనాలు, పద్య కవితా పోటీలు నిర్వహించడమే కాకుండా అనేక జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించారు. ప్రతి సంవత్సరం భాషా సేవ చేసే సాహితీవేత్తలకు తన్నీరు కోటయ్య స్మారక జాతీయ పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. తెలుగు కీర్తి పురస్కారాన్ని అందుకున్న బాలాజీని జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్, డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వరరావు, డీసీఈబీ సెక్రటరీ మర్రి శ్రీనివాస్, ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు, ఎంఈఓ లు చెంచుపున్నయ్య, వెంకారెడ్డి, నాగేంద్రవదన, రామారావు, హరిబాబు, రమణయ్య, స్కౌట్స్ అండ్ గైడ్ అసోసియేషన్ కార్యవర్గం పత్రె వెంకటరావు, కె.వి.శేషారావు, హేబ్సిబా, పలువురు ఉపాధ్యాయులు బాలాజీని అభినందించారు.



తెలుగు కీర్తి జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న తన్నీరు బాలాజీ

శిక్ష పడుతుందన్న భయంతో రౌడీ షీటర్ ఆత్మహత్య

ఒంగోలు టౌన్: భార్యను హతమార్చిన కేసులో శిక్ష పడుతుందన్న భయంతో రౌడీ షీటర్ ఒకరు ఆత్మహత్య చేసుకొని మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం... త్రోవగుంట ఎస్సీ కాలనీకి చెందిన రౌడీ షీటర్ బత్తుల పిచ్చయ్య పై భార్యను హత్య చేసినట్లు మద్దిపాడు పోలీసు స్టేషన్లో కేసు నమోదై ఉంది. ఆ కేసు కోర్టులో ట్రయల్ నడుస్తోంది. తనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చి శిక్ష పడుతుందన్న భయంతో మద్యం తాగి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్ కు తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

- కూటమి ప్రభుత్వంలో చెలరేగిపోతున్న భూ అక్రమార్కులు
- ప్రభుత్వ భూములు కనిపిస్తే పాగా చేస్తున్న టీడీపీ నేతలు
- ఆక్రమిత భూముల మార్కెట్ విలువ రూ.15 కోట్ల పైమాటే..
- మండల, జిల్లా స్థాయి దాటి సీఎంవో స్థాయిలో ఫిర్యాదులు
- ఇటీవల గానుగపెంట వద్ద టీడీపీ నేత ఆక్రమించిన భూమి స్వాధీనం


ఆక్రమణకు గురైన భూముల్లో ఓ భాగం

కబ్జా కోరల్లో 150 ఎకరాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ''ఎక్కడైనా భూ కబ్జాలకు పాల్పడితే ఆ నా కొ..లను జైల్లో వేయించి బయటకు రాకుండా చేస్తాం'' అని మార్కాపురం ఎమ్మెల్యే చేసిన హెచ్చరికలను ఆ పార్టీ నేతలు పూచికపుల్లలా తీసిపడేశారు. క్షేత్ర స్థాయిలో టీడీపీ నాయకులు అధికారమే అండగా భూ కబ్జాలతో చెలరేగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదలైన ఈ ఆక్రమణ బాగోతం తర్లుపాడు మండలంలో అప్రతిహతంగా సాగుతోంది. ఇటీవల గానుగపెంట గ్రామ సమీపంలో ఓ టీడీపీ నేత 10 ఎకరాల పశువుల బీడును ఆక్రమించి మామిడి, కొబ్బరి మొక్కలు నాటుకున్న వైనంపై 'సాక్షి'లో కథనం రావడంతో రెవెన్యూ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. తాజాగా తర్లుపాడు మండలంలోని బుడ్డపల్లి గ్రామంలో టీడీపీ నేతల భూ దందాపై నేరుగా సీఎం చంద్రబాబుకే ఫిర్యాదు అందడం.. విచారణ చేపట్టాలంటూ సీఎంవో నుంచి ఆదేశాలు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది.

ఆక్రమణలు ఇలా..

కేతగుడిపి రెవెన్యూ ఇలాఖాలోని బుడ్డపల్లి గ్రామ పరిధిలో సర్వే నంబరు 112లో 6 ఎకరాలు, 113లో 7.9 ఎకరాలు, 109/1లో 2.76 ఎకరాలు, 109/3లో 5.86, 317లో 65.12, 294లో 11.74, 330లో 12.36, 331లో 10.02, 338లో 11.6 ఎకరాలు, 26/1లో 78 సెంట్లు, 21/1లో 1.25 ఎకరాలు, 117లో 2 ఎకరాలు, 117, 118 సర్వే నంబర్లలో 10 ఎకరాలు.. ఇలా సుమారు 150 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎకరా మార్కెట్ ధర రూ.10 లక్షలుగా లెక్కగట్టినా సుమారు 15 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయింది.

టీడీపీ నేతల పనే..

బుడ్డపల్లి గ్రామ పరిసరాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు దర్జాగా కబ్జా చేశారు. ఈ కబ్జా బాగోతంపై అదే గ్రామానికి చెందిన ఏడుకొండలు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణల డొంక కదిలింది. సీఎంఓ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం విచారణ ప్రారంభించారు. మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ విజయభాస్కర్, ఆర్ఐ, వీఆర్ఓ తదితరులు ఆక్రమిత భూములను పరిశీలించారు. డాక్యుమెంట్లు ఉన్నాయా అని భూములను స్వాధీనంలో ఉంచుకున్న వారిని ప్రశ్నించగా సరైన సమాధానం లేదు. దీంతో ఆక్రమణదారులు ఖాళీ చేసి వెళ్లాలంటూ సబ్ కలెక్టర్ హెచ్చరించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

12వ పీఆర్సీ కమిషన్ నియమించాలి

- ఇప్పటికే 18 నెలల కాలాన్ని కోల్పోయాం
- ఐఆర్ 29 శాతం ప్రకటించి, బకాయిలు విడుదల చేయాలి
- కలెక్టర్‌కు యూటీఎఫ్ నాయకుల మెమోరాండం


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మెమోరాండం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఒంగోలు సిటీ: ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు కోరారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కలెక్టర్‌కు తమీమ్ అన్సారియాకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. 2023 జూలై ఒకటి నుంచి 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉండగా నేటికీ కమిటీని కూడా నియమించకపోవడం వల్ల 18 నెలల కాలాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అంతే కాకుండా 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలు రూ.7384 కోట్లు, డీఏ బకాయిలు రూ.9,650 కోట్లు, ఎంప్లాయి సరెండర్ లీవ్ బకాయిలు రూ.2250 కోట్లు, సీపీఎస్ బకాయిలు రూ.2500 కోట్లు, ఏపీ జీఎల్ఐ బకాయిలు రూ.950 కోట్లు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంతోపాటు ఐఆర్ 29 శాతం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.రవి, జిల్లా సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఎం.సంధ్యారాణి, నారాయణ, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా అద్దయ్య


కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ కలెక్టర్ అద్దయ్య

ఒంగోలు టౌన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ కె. అద్దయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూస్తానని చెప్పారు. హెచ్ఓడీలతో సమావేశమై సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. రోగుల ఆరోగ్యంపై వైద్యులు, సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఆర్ఎంఓ మాధవీలత , డిప్యూటీ డైరెక్టర్ మంజుల, అడిషనల్ డైరెక్టర్ లక్ష్మీ కుమారి, ఏఓ రమణమ్మ పాల్గొన్నారు. నూతన అడ్మినిస్ట్రేటర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు కలిసి అభినందనలు తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ.. అనంత లోకాలకు..


సంఘటన స్థలంలో మృతి చెందిన చిరంజీవి


చికిత్స పొందుతూ మృతి చెందిన దుర్గారావు


ప్రమాదానికి కారణమైన కర్రల ట్రాక్టర్

- కర్రల లోడ్ ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు మృతి
- ఒంగోలు జీజీహెచ్‌లో చావుబతుకుల మధ్య మరొకరు..
- మృతులది ముండ్లమూరు మండలం శంకరాపురం
- కామేపల్లి నుంచి స్వగ్రామం వెళ్తుండగా కొండపిలో ఘటన

కొండపి: పోలేరమ్మ తల్లిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న ముగ్గురిని కర్రల ట్రాక్టర్ రూపంలో మృత్యువు వెంటాడింది. వారిలో ఇద్దరు విగతజీవులు కాగా మరో యువకుడు ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ విషాద ఘటన కొండపి సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన చిరంజీవి, దుర్గారావు, అద్దంకి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన అమీన్ కలిసి మంగళవారం జరుగుమల్లి మండలంలోని కామేపల్లిలో పోలేరమ్మ తల్లి దర్శనానికి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉన్న వీరిని కొండపి శివారులోని జేఎల్ కోల్డ్ స్టోరేజ్ సమీపంలో మూగచింతల నుంచి కట్టవారిపాలేనికి కర్రల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిరంజీవి(40) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా 108లో కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కొండపి ప్రభుత్వ వైద్యశాలలో దుర్గారావు(35) మృతి చెందాడు. అద్దంకి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన అమీన్ పరిస్థితి విషమించడంతో ఒంగోలులోని జీజీహెచ్‌కు తరలించారు. ఘటన జరిగిన వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

మార్జిన్ లైట్లు లేకనే..

ఎదురుగా కర్రల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను చీకట్లో గమనించలేకపోవడంతోనే ద్విచక్ర వాహనదారులు ప్రమాదం బారినపడినట్లు తెలుస్తోంది. సాధారణంగా రాత్రి వేళ ప్రయాణించే కర్రల లోడ్ ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు లేదా మార్జిన్ లైట్లు ఉండాలి. కానీ అవేవీ లేకపోవడంతోనే ఘోర ప్రమాదం సంభవించిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ లైట్లను డిమ్.. డిప్ చేసినా మార్జిన్ అర్థమై అప్రమత్తమయ్యే అవకాశం ఉండేదని పలువురు అభిప్రాయపడ్డారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స


విలేకరులతో మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు

- కాకినాడకు చెందిన మహిళకు రినోస్పోరిడియోసిస్
- ఆపరేషన్ చేయగా కోలుకున్నట్లు వైద్యుల వెల్లడి

ఒంగోలు టౌన్: నాసికా సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఒక మహిళకు జీజీహెచ్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. కాకినాడకు చెందిన 30 ఏళ్ల నందిని అనే మహిళ గత కొంతకాలంగా నాసికా సంబంధమైన సమస్యతో ప్రైవేట్ వైద్యశాలల చుట్టూ తిరిగారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఇటీవల ఒంగోలు జీజీహెచ్‌లో ఈఎన్‌టీ వైద్యులను సంప్రదించారు. బయాప్సీ పరీక్ష అనంతరం ఆమె అరుదైన రినోస్పోరిడియోసిస్ అనే వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. వ్యాధి ముదరడంతో ముక్కు కండ పెరిగి శ్వాస ఆడని పరిస్థితిలో ఉన్న ఆమెకు వెంటనే శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం నందిని పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

వైద్యులకు అభినందనలు


అరుదైన రినోస్పోరిడియోసిస్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు విజయవంతంగా ఆపరేషన్ చేసిన జీజీహెచ్‌లోని ఈఎన్‌టీ వైద్యుల బృందాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు అభినందించారు. మంగళవారం జీజీహెచ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిల్వ ఉన్న నీటిని తాగడం వల్ల వచ్చే ఈ అరుదైన వ్యాధిని సకాలంలో గుర్తించడమే కాకుండా వెంటనే ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలను కాపాడామని చెప్పారు. సమావేశంలో ఈఎన్‌టీ హెచ్ఓడీ ప్రభాకర్, అసోసియేట్ ప్రొఫెసర్లు పీవీ సంపత్ కుమార్, పి.రాంబాబు, అనస్తీషియా హెచ్ఓడీ జయసుందరం, అసోసియేట్ ప్రొఫెసర్లు పి.చలపతి రావు, త్రినాథ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.హిమబిందు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం!


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కనిగిరి రూరల్: విద్యుత్ స్తంభంపై నుంచి పడి ప్రైవేట్ విద్యుత్ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం కనిగిరి మండలం వంగపాడులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గురువాజీపేట సబ్ స్టేషన్ పరిధిలో జూనియర్ లైన్‌మన్ ఎస్.మహేశ్వరరెడ్డి వంగపాడు పొలాల్లో విద్యుత్ లైన్ మరమ్మతులు చేసేందుకు గ్రామానికి చెందిన కుమ్మరికుంట దేవరాజు(21)ను పిలిచాడు. స్తంభంపై దేవరాజు పనిచేస్తున్న క్రమంలో విద్యుత్ ప్రసారం కావడంతో షాక్‌కు గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి కుమ్మరికుంట చిట్టిబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. చేతికంది వచ్చిన కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ చనిపోయాడని ఆరోపించారు.

ఉత్సాహంగా రంగోత్సవ్ పోటీలు


జానపద నృత్యంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న శివపార్వతి

సంతనూతలపాడు: జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ డైట్ కళాశాల ఆవరణలో మంగళవారం ఉత్సాహంగా సాగాయి. డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా ఏఎస్పీ అశోక్ బాబు పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో ఎం.చైత్రన్, డ్రాయింగ్‌లో జి.శృతి, హ్యాండ్ రైటింగ్‌లో వి.యామిని, రంగోలిలో జి.వైష్ణవి, ఫోక్ డ్యాన్స్‌లో శివపార్వతి, డిజిటల్ కాలేజ్‌లో రాహుల్, స్లోగన్ రైటింగ్‌లో ఎస్.నీలిమ, రోల్ ప్లేలో షేక్ ఆసిఫ్ భాను విజేతలుగా నిలిచారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీహెచ్ మాధవీలత, ఎం శ్రీనివాసరావు, ఎం.మురళీ కృష్ణ, ఎం.శర్మ, ఎం.ఇందిరాదేవి వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కష్టజీవుల పక్షపాతి 'రావులపల్లి'


మాట్లాడుతున్న సీపీఐ నేత నారాయణ

మార్కాపురం టౌన్: కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నేత, కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం తుది శ్వాస వరకు పోరాడిన రావులపల్లి చెంచయ్య సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ కొనియాడారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో చెంచయ్య వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణ మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశంలో తొలితరం కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాటాలు చేసిన వ్యక్తి చెంచయ్య అని పేర్కొన్నారు. దివంగత పూలసుబ్బయ్య, గుజ్జుల యలమందారెడ్డి, సానికొమ్ము కాశిరెడ్డి తదితర నాయకులతో కలిసి సమస్యలపై పోరాడారని గుర్తు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తున్నామన్నారు. వెలుగొండ ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎన్‌వి రమణ, ఎస్‌కే ఖాశీం, చిత్తారి పెద్దన్న, ఏలూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రసముద్రం ఘటనపై డీఎస్పీ విచారణ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

దొనకొండ: మండలంలోని రుద్రవరం గ్రామంలో తన భార్యకు మరొకరు సెల్‌ఫోన్ కొనివ్వడంపై ఆగ్రహించిన దుగ్గెంపూడి మల్లికార్జున.. ఎస్టీ కులానికి చెందిన మోటా వెంకటేశ్వర్లు రేకుల షెడ్, ఆటో, రెండు బైకులను తగలబెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం రుద్రసముద్రం చేరుకున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ స్థానికులకు విచారించారు. ఘటన పూర్వాపరాలపై ఆరా తీశారు. 'వెంకటేశ్వర్లు సెల్ ఫోన్ కొనిచ్చి నీతో మాట్లాడాలని బలవంతం చేయబోయాడ'ని మల్లికార్జున భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే 'మా నివాసాన్ని, ఆటో, బైకులను కాల్చి, అంతు చూస్తాం, ఊరి నుంచి వెళ్లిపోండి' అని మల్లికార్జున బెదిరించడంపై మోటా శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. ఇరువర్గాల వాంగ్మూలాలు తీసుకున్నామని, విచారణ అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఆయన వెంట సీఐ డి.హసన్ ఉన్నారు.

లారీ డ్రైవర్ మృతి

ఒంగోలు టౌన్: భార్యా భర్తల మధ్య మనస్పర్థలతో ఆత్మహత్యకు పాల్పడిన లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం నగరంలోని నెహ్రూ నగర్ కు చెందిన లారీ డ్రైవర్ కోడె మహేష్ ఈ నెల 18వ తేదీన భార్యతో ఘర్షణ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన మహేష్ మద్యం తాగిన మత్తులో పెట్రోలు పోసుకొని కాల్చుకున్నాడు. అతడిని వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.